నమస్తే తెలంగాణ





భువనగిరిలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఫర్నిచర్‌ను ధ్వంసం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు



బీఆర్ఎస్ కార్యాలయంపై దాడి చేసిన యూత్ కాంగ్రెస్ నాయకులను బయటకు తీసుకెళ్తున్న పోలీసులు

# కాంగ్రెస్ గూండాగిరీ

మొదటిపేజీ తరువాయి...

ఘటనను బీఆర్ఎస్‌తోపాటు పలు రాజకీయ పార్టీలు, సంఘాలు తీవ్రంగా ఖండించాయి. దాడికి పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ చేపట్టిన ఆందోళనలతో భువనగిరిలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

### ముందస్తు ప్రణాళిక ప్రకారమే

యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో శనివారం మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ఎన్నికల హామీల అమలులో విఫలమవడంపై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్ నేతల విమర్శల నేపథ్యంలో దాడి చేయాలని ప్రణాళిక వేసుకున్న యూత్ కాంగ్రెస్ నేతలు పక్కనే ఉన్న ఐటీఐ కాలేజీ వద్ద కాపు కాశారు. ప్రెస్‌మీట్ పూర్తయ్యాక బీఆర్ఎస్ నేతలందరూ వెళ్లిపోయాక యూత్ కాంగ్రెస్ నేతలు రంగప్రవేశం చేశారు. మాజీ మంత్రి కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ కార్యాలయంలోకి దూసుకెళ్లారు. ప్రణాళిక ప్రకారం లోపలికి ప్రవేశిస్తూనే కార్యాలయంలో విధ్వంసం సృష్టించారు. కుర్చీలను విరగ్గొట్టారు. అద్దాలను పగులగొట్టారు. అంతటితో ఆగకుండా కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలను విరగ్గొట్టారు. ఫ్లెక్సీలను చింపేశారు. లోపలి రూమ్‌లోకి వెళ్లి టీవీని పగులగొట్టారు. పార్టీ కార్యాలయం ముందు బైఠాయించారు. పోలీసులు వారిని అరెస్ట్ చేసి, అదుపులోకి తీసుకున్నారు. దాడి గురించి సమాచారం అందుకున్న పైళ్ల శేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ నేత క్యామ మల్లేశ్, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పార్టీ కార్యాలయాన్ని సందర్శించారు. దాడి జరిగిన ప్రాంతాలను పరిశీలించారు.



భువనగిరి పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

## నేడు భువనగిరిలో బీఆర్ఎస్ మహాధర్నా

భువనగిరి అర్బన్, జనవరి 11: భువనగిరిలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంపై కాంగ్రెస్ పార్టీ గూండాలు చేసిన దాడికి నిరసనగా ఆదివారం మహాధర్నాకు బీఆర్ఎస్ సిద్ధమైంది. బీఆర్ఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ఉదయం 10 గంటలకు మహాధర్నా ఉంటుందని ఆ పార్టీ మండలాధ్యక్షుడు జనగాం పాండు శనివారం తెలిపారు. మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, గాదరి కిశోర్‌కుమార్, చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, జడ్పీ మాజీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. బీఆర్ఎస్ జిల్లా, పట్టణ, మండల కమిటీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ఉద్యమకారులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

### పోలీసులకు ముందే సమాచారం?

బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ నేతల దాడి గురించి పోలీసులకు ముందే తెలిసినట్టు సమాచారం. ఘటనకు ముందు ఓ ఎస్ఐతోపాటు కొందరు కానిస్టేబుళ్లు పార్టీ కార్యాలయానికి వచ్చారు. యూత్ కాంగ్రెస్ నేతలు దాడి చేసే అవకాశం ఉందని అక్కడే ఉన్న తమకు పోలీసులు చెప్పారని కొందరు బీఆర్ఎస్ కార్యకర్తలు చెబుతున్నారు. తొలుత ముగ్గురు పోలీసులు మాత్రమే వచ్చారని, ఆ తర్వాత మరో ఇద్దరు వచ్చారని పేర్కొంటున్నారు. అయితే పోలీసులు అక్కడ ఉండగానే, వారి కండ్లముందే దాడి జరగడం వీడియోల్లో స్పష్టంగా కనిపిస్తున్నది. ఈ నేపథ్యంలో ముందే సమాచారం ఉన్నప్పుడు యూత్ కాంగ్రెస్ నాయకులను పార్టీ కార్యాలయం వరకు పోలీసులు ఎందుకు అనుమతించారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

### బీఆర్ఎస్ ఆందోళన.. ఉద్రిక్త పరిస్థితులు

యూత్ కాంగ్రెస్ విధ్వంసంపై బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పైళ్ల శేఖర్‌రెడ్డి నేతృత్వంలో భువనగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌కు పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. స్టేషన్ ఎదుట బైఠాయించారు. కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దాడికి పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. అక్కడి నుంచి పెద్దఎత్తున ర్యాలీగా ప్రిన్స్ కార్నర్ వద్దకు తరలివెళ్లారు. అనంతరం బీఆర్ఎస్ కార్యకర్తలు.. కాంగ్రెస్, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఫ్లెక్సీలను దహనం చేశారు.

### ఏడాదంతా డైవర్షన్ పాలిటిక్స్.. ఇప్పుడు దాడులా?



కాంగ్రెస్ పాలన దాడులను ప్రోత్సహించేలా కొనసాగుతున్నదని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమై ఏడాదంతా డైవర్షన్ పాలిటిక్స్ చేశారని, ఇప్పుడు దాడులకు తెగబడుతున్నారని దుయ్యబట్టారు. భువనగిరిలో బీఆర్ఎస్ కార్యాలయంపై దాడి దుర్మార్గమని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు సరికావని హితవు పలికారు. కాంగ్రెస్ గూండాలతో పోలీసులు కలిసి దాడులకు పాల్పడుతున్నారని చెప్పడానికి ఇది అతిపెద్ద ఉదాహరణ అని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ దాడులను ఉపేక్షించేది లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అల్లర్లు, అరాచకాలను ప్రోత్సహించే తత్వం ఉన్న వ్యక్తి అని దుయ్యబట్టారు. ఇలాగే కొనసాగితే కాంగ్రెస్‌పై ప్రజలే దాడులకు దిగే పరిస్థితి వస్తుందని తెలిపారు.

–జగదీశ్‌రెడ్డి, మాజీ మంత్రి

### రేవంత్‌ను విమర్శిస్తే దాడులా?



ప్రజల్లో కాంగ్రెస్ పట్ల వ్యతిరేకత వస్తున్నదని గ్రహించిన అధికార పార్టీ గూండాలు బీఆర్ ఎస్ ఆఫీస్‌పై దాడికి పాల్పడ్డారని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి మండిపడ్డారు. బీఆర్ఎస్ కార్యాలయానికి పోలీసులు ముందే వచ్చారని, ఆ తర్వాతే కాంగ్రెస్ గూండాలు వచ్చారని తెలిపారు. గూండాలు విధ్వంసం చేస్తుంటే పోలీసులు చోద్యం చూశారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డిని విమర్శిస్తే పార్టీ కార్యాలయంపై దాడి చేస్తారా అని నిలదీశారు.

– పైళ్ల శేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, భువనగిరి

## ఇందిరమ్మ రాజ్యమంటే దాడులా?

- సమాధానం చెప్పలేక దాడులు
- చూస్తూ ఊరుకోం.. బుద్ధి చెప్తం
- మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్



హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రశాంతంగా ఉన్న తెలంగాణలో ఏడాది కాంగ్రెస్ పాలనలోనే అశాంతి, అలజడి నెలకొన్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆవేదన వ్యక్తంచేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ నేతల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి వేసిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక కాంగ్రెస్ నేతలు దుర్మార్గపు దాడులకు పాల్పడ్డారని మండిపడ్డారు. కాంగ్రెస్ వచ్చాక ప్రతిపక్షాలపై దాడుల సంస్కృతిని ప్రోత్సహిస్తున్నదని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి మాటలతో దాడులు చేస్తే, కాంగ్రెస్ నేతలు భౌతిక దాడులకు తెగబడుతున్నారని ధ్వజమెత్తారు. 'ఇందిరమ్మ రాజ్యమంటే ఇదేనా? పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఇలాంటి అడ్డగోలు పరిస్థితులు ఉండేవా?' అని ప్రశ్నించారు. దాడులు పునరావృతమైతే చూస్తూ ఊరుకునేది లేదని, తగిన రీతిలో బుద్ధి చెప్తామని హెచ్చరించారు.

## కాంగ్రెస్ డీఎన్ఏలోనే విద్వేషం

- రాజకీయంగా ఎదుర్కోలేకే దాడులు
- కాంగ్రెస్ గూండాల దాడి పిరికిపంద చర్య : ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ డీఎన్ఏలోనే ద్వేషం, హింస, విధ్వంసం ఉన్నాయని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రంగా మండిపడ్డారు. బీఆర్ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ గూండాల దాడిని ఆమె ఖండించారు. సీఎం ప్రోద్బలంతోనే కాంగ్రెస్ గూండాలు రెచ్చిపోతున్నారని విరుచుకుపడ్డారు. బీఆర్ఎస్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక కాంగ్రెస్ హింసాత్మక చర్యలకు పాల్పడడం దుర్మార్గమని నిప్పులు చెరిగారు. భౌతిక దాడులతో గులాబీ సైనికులను భయపెట్టలేరని తేల్చిచెప్పారు. ఈ దాడిని పిరికిపంద చర్యగా అభివర్ణించారు. రాహుల్‌గాంధీ వల్లించే మొహబ్బత్ కీ దుకాన్ ఒక బూటకమని తేటతెల్ల మైందని, అది విద్వేషం, హింసను ప్రేరేపించే దుకాణమని ధ్వజమెత్తారు. విధ్వంసకర చర్యలకు తెలంగాణలో తావు లేదని తెలిపారు. కాంగ్రెస్ విష సంస్కృతికి ఈ డాడి నిదర్శనమని, సిగ్గుమాలిన కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెప్తారని, తమ నాయకుల జోలికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

# దాడులకు భయపడం

## సర్కారును ప్రశ్నించటం ఆపం • సమాధానం చెప్పలేక దాడులా?

- ముఖ్యమంత్రి ఆదేశాలతోనే భువనగిరి బీఆర్ఎస్ ఆఫీస్‌పై కాంగ్రెస్ గూండాల దాడి
- ఉమ్మడిరాష్ట్రంలో ఇంతకన్నా వందరెట్ల అణచివేత
- అయినా లెక్కచేసేది లేదు : మాజీ మంత్రి కేటీఆర్



హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ) : యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ గూండాల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, పరిపాలన చేతకాని ముఖ్యమంత్రి రేవంత్ ఆదేశాలతోనే కాంగ్రెస్ నేతలు ఈ భౌతిక దాడులకు తెగబడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. హోంమంత్రిగా కూడా ఉన్న ముఖ్యమంత్రి ఆదేశాలతోనే కాంగ్రెస్ గూండాలు రెచ్చిపోయి, ఇలాంటి దాడులకు తెగబడుతున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ చేసిన మోసాలపై బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి సంధించిన ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం లేకనే ఇలాంటి దిగజారుడు చర్యలకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టడం, దాడులు చేయడమే ఇందిరమ్మ రాజ్యమా? అని ప్రశ్నించారు. పదేండ్లపాటు ప్రశాంతంగా ఉన్న తెలంగాణ రాష్ట్రం, నేడు అరాచకాలకు చిరునామాగా మారిందని, దాడులు, గూండాగిరీ తమ మార్కు పాలన అని కాంగ్రెస్ మరోసారి నిరూపించుకుంటున్నదని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీల కార్యాలయాలపైన దాడులు చేయడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని ధ్వజమెత్తారు.

### అరాచక శక్తులకు అడ్డులేకుండా పోయింది

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అరాచక శక్తులకు అడ్డూఅదుపూ లేకుండా పోయిందని, ఇందిరమ్మ రాజ్యం పేరుతో గద్దెనెక్కిన కాంగ్రెస్, తెలంగాణలో గూండారాజ్యాన్ని నడిపిస్తున్నదని కేటీఆర్ నిప్పులు చెరిగారు. చేతిలో రాజ్యాంగాన్ని పట్టుకొని పోజులు కొట్టే రాహుల్ గాంధీకి, రేవంత్ పాలనలో అప్రజాస్వామిక చర్యలు కనిపించడం లేదా అని నిప్పులు చెరిగారు. రాహుల్ ఇప్పటికైనా హిపోక్రసీ కట్టిపెట్టి, కాంగ్రెస్ సర్కారును సరిదిద్దాలని సూచించారు.

### వందరెట్ల అణచివేతనే లెక్కచేయలే

రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపుతప్పాయని చెప్పేందుకు బీఆర్ఎస్ కార్యాలయంలో కాంగ్రెస్ అరాచక చర్య కన్నా నిదర్శనం ఇంకేం కావాలని కేటీఆర్ నిలదీశారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్నవారిపై దాడులకు తెగబడుతున్న కాంగ్రెస్‌కు ప్రజలే తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ కార్యాలయాలకే రక్షణ లేకపోతే ఇక రాష్ట్రంలో పరిశ్రమలకు, పెట్టుబడులకు, మారుమూల పల్లెల్లో నివసిస్తున్న పేద, బడుగు బలహీనవర్గాల ప్రజలకు రక్షణ ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. దాడులతో బీఆర్ఎస్ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయాలని చూడటం ముఖ్యమంత్రి అవివేకమేనని దుయ్యబట్టారు. సమైక్యరాష్ట్రంలో ఇంతకన్నా వందరెట్ల అణచివేతను, నిర్బంధాన్ని, దాడులను తట్టుకొని నిలబడిన తెలంగాణ ప్రజల గుండెచప్పుడుగా బీఆర్ఎస్ నిలిచిందని గుర్తుచేశారు. తమ పార్టీ కార్యకర్తల జోలికి, కార్యాలయాల జోలికి వస్తే తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 60 లక్షల మంది బీఆర్ఎస్ కార్యకర్తలు కన్నెరజేస్తే కాంగ్రెస్ నేతలు తెలంగాణ ప్రజాక్షేత్రంలో తిరగగలరా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ కార్యాలయంపై దాడి చేసిన కాంగ్రెస్ గూండాలతోపాటు వారి వెనుక ఉన్న నాయకులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. 'కాంగ్రెస్‌దాడులు చేసినా.. ఎన్ని రకాల అక్రమ కేసులు బనాయించినా తెలంగాణ ప్రజల తరపున ప్రశ్నిస్తూనే ఉంటం.. ప్రాణాలను పణంగా పెట్టి సాధించుకున్న రాష్ట్రాన్ని కంటికి రెప్పలా కాపాడుకునేందుకు ఎంతటి త్యాగాలకైనా సిద్ధంగా ఉంటం' అని కేటీఆర్ స్పష్టంచేశారు.

### కాంగ్రెస్ దాడి హేయం: వేముల



హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ గూండాల దాడి హేయమని మాజీ మంత్రి, బాల్కొండ ఎమెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి.. హింసను ప్రోత్సహిస్తున్నారా? అని నిలదీశారు.

### సమర్థనీయం కాదు: రవిచంద్ర



పార్టీ కార్యాలయాలపై దాడులు సమర్థనీయం కాదని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పేర్కొన్నారు. బీఆర్ఎస్ కార్యాలయంపై దాడిని తీవ్రంగా ఖండించారు. అప్రజాస్వామిక చర్యలకు వెంటనే స్వస్తి పలకాలని కాంగ్రెస్‌కు హితవు పలికారు.

### దాడి పిరికిపంద చర్య: కొప్పుల



కాంగ్రెస్ నాయకుల దాడిని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఖండించారు. ప్రజల పక్షాన ప్రశ్నిస్తే దాడి చేస్తారా? అని నిలదీశారు. దాడి ఓ పిరికిపంద చర్య అని మండిపడ్డారు. ఎన్ఎస్‌యూఐ నాయకులు దాడి చేస్తుంటే పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించారని ధ్వజమెత్తారు.

### పెద్దల ప్రోత్సాహంతో దాడులు: బడుగుల



ప్రభుత్వ పెద్దల ప్రోత్సాహంతోనే బీఆర్ఎస్‌పై దాడు లు జరుగుతున్నాయని మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ ఆరోపించారు. కాంగ్రెస్ ఆటవిక దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక దాడులు చేయించడం దుర్మార్గమని దుయ్యబట్టారు.

### రాహుల్ స్పందించాలి: సుమన్



కాంగ్రెస్ గూండాలు దాడి హేయనీయమని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని పట్టుకుని తిరుగుతున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఈ ఘటనపై స్పందించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆయనే ప్రోత్సహిస్తున్నట్టు భావించాల్సి వస్తుందని పేర్కొన్నారు.

### ఇందిరమ్మ రాజ్యమంటే హింసనా? : జీవన్‌రెడ్డి



ఇందిరమ్మ రాజ్యమంటే హింసా, ధ్వంసమేనా? అని మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. బీఆర్ఎస్ కార్యాలయంపై దాడిని తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ గూండాల ఆటవిక దాడి హేయమైన చర్య అని మండిపడ్డారు.

### బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి: రవీంద్రకుమార్



బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంపై దాడికి పాల్పడిన కాంగ్రెస్ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ డిమాండ్ చేశారు. దాడులు మంచి సంస్కృతి కాదని హితవు పలికారు.

### పోలీసులే చేయించారు: గొంగిడి



బీఆర్ఎస్ కార్యాలయంపై పోలీసులే దగ్గరుండి దాడి చేయించారని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఘటన గురించి పోలీసులకు ముందే తెలిసినా అడ్డుకోలేదని తెలిపారు. రౌడీయిజాన్ని కాంగ్రెస్ పార్టీ మర్చిపోవడం లేదని మండిపడ్డారు.

### మూల్యం తప్పదు: భిక్షమయ్యగౌడ్



బీఆర్ఎస్ ఆఫీస్‌పై దాడి చేసిన కాంగ్రెస్ భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్ హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో దాడులు చేస్తామంటే ప్రతిదాడులు కూడా తప్పవని హెచ్చరించారు.

### సమాధానం లేకనే: చిరుమర్తి



ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు సమాధానం చెప్పలేకే కాంగ్రెస్ పెద్దలు దాడులు చేయించారని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శించారు. ప్రజాస్వామ్యంలో విమర్శలు, ప్రతి విమర్శలు సహజమని పేర్కొన్నారు.

### పార్టీ ఆఫీసుపై దాడి అనైతికం: ఉపేంద్ర



బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై దాడి అనైతికమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఉపేంద్ర విమర్శించారు. హామీలు అమలు చేయాలని బీఆర్ఎస్ నేతలు అడిగితే పార్టీ కార్యాలయంపై దాడి చేయడం గర్హనీయమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో డైవర్షన్ డ్రామాలు తప్పా, ఉద్ధరించేందేమీలేదని దుయ్యబట్టారు. ప్రజాపాలన ముసుగులో హింసను ప్రేరేపించడం దుర్మార్గమని మండిపడ్డారు.

### దాడులు ప్రజాపాలనా?:యాదయ్య



ప్రజాపాలన అంటే ప్రశ్నించిన వారిపై దాడులు చేయడమేనా? అని తెలంగాణ సర్పంచుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు యాదయ్యగౌడ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ సర్కర్ విఫలమైందని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు అడిగితే కార్యాలయంపై దాడిచేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు. అడ్డుకోవాల్సిన పోలీసులు చోద్యం చూడడం బాధాకరమని తెలిపారు.

### బాధ్యులపై కేసులు నమోదు చేయాలి: కురవ విజయ్



కాంగ్రెస్ నాయకుల ఆగడాలు రోజురోజుకూ శ్రుతిమించుతున్నాయని బీఆర్ఎస్ నేత కురవ విజయ్ విమర్శించారు. హామీలు అమలు చేయాలని బీఆర్ఎస్ నేతలు అడిగితే దాడులు చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. బాధ్యులపై పోలీసులు వెంటనే కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో కక్షలు, కుతంత్రాలు తప్పా సాధించిందేమీలేదని విమర్శించారు.

### మూల్యం తప్పదు: రూప్‌సింగ్



బీఆర్ఎస్ కార్యాలయంపై దాడి చేసిన కాంగ్రెస్ పార్టీకి తగిన మూల్యం తప్పదని బీఆర్ఎస్ నేత రూప్‌సింగ్ హెచ్చరించారు. దాడి చేసిన దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలని, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడులను పక్కనబెట్టి అభివృద్ధిపై దృష్టి సారించాలని కాంగ్రెస్ సర్కార్‌కు హితవు పలికారు. ఇలాంటి దాడులను విడనాడాలని కోరారు.

### భౌతిక దాడులు సరికాదు: జహంగీర్



'బీఆర్ఎస్ ఆఫీసుపై కాంగ్రెస్ కార్యకర్తల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్ పేర్కొన్నారు. రాజకీయాల్లో విమర్శ, ప్రతి విమర్శ సహజమని, దాడులు చేయడం సరికాదని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను అందరూ గౌరవించాలని, భౌతిక దాడులకు పూనుకోవడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఇలాంటివి మళ్లీ జరుగకుండా చూసుకోవాలని, పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు.

### విధ్వంసపాలన: దేవీప్రసాద్



రాష్ట్రంలో విధ్వంస పాలన కొనసాగుతున్నదని కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్ విమర్శించారు. భువనగిరిలో బీఆర్ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ దాడి దుర్మార్గమని విమర్శించారు.

### రేవంత్ వైఖరితోనే హింస: దాసోజు



సీఎం రేవంత్‌రెడ్డి నిత్యం హింసను ప్రోత్సహించేలా మాట్లాడుతుండటంతోనే రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ విమర్శించారు. ఆయన బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని ఒక ప్రకటనలో పేర్కొనారు.

### పునరావృతమైతే తరిమికొడతం: క్యామ మల్లేశ్



'బీఆర్ఎస్ ఆఫీస్‌ను ధ్వంసం చేసి, దురహంకారంతో వ్యవహరించడం సరికాదని, ఇలాంటి దాడులు మళ్లీ పునరావృతమైతే తరిమికొడతామని బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్ హెచ్చరించారు. ఈ ఘటనపై పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం సిగ్గుచేటని పేర్కొన్నారు.

### పాలన చేతకాకే దాడులు: రాజీవ్‌సాగర్



పాలన చేతగాకే కాంగ్రెస్ పార్టీ దాడులకు తెగబడుతున్నదని తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడె రాజీవ్‌సాగర్ విమర్శించారు. బీఆర్ఎస్ ఆఫీస్‌పై కాంగ్రెస్ గూండాల దాడిని ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు.

### కాంగ్రెస్‌ది అరాచక పాలన: పల్లె రవికుమార్



రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అరాచక పాలన కొనసాగిస్తున్నదని రాష్ట్ర కల్లు గీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్ విమర్శించారు. బీఆర్ఎస్ ఆఫీస్‌పై కాంగ్రెస్ గూండాల దాడిని తీవ్రంగా ఖండించారు.

### తప్పిదాలను ఎండగడుతూనే ఉంటాం: బాలరాజు



ఎన్ని దాడులు చేసినా ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వ తప్పిదాలను ఎండగడతామని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి దూదిమెట్ల బాలరాజుయాదవ్ స్పష్టం చేశారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులే.. ప్రతిపక్ష పార్టీ జిల్లా కార్యాలయంపై దాడి చేస్తున్న కాంగ్రెస్ గూండాలకే రక్షణ కల్పిస్తుందా? అని ప్రశ్నించారు.

### పిరికిపంద చర్య: చింతల




'బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై దాడిని పిరికిపంద చర్య అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్ రెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. తాము దాడులు మొదలుపెడితే కాంగ్రెస్ నేతలు ఇండ్లల్లో ఉండలేని పరిస్థితి ఉంటుందని హెచ్చరించారు.

### పోలీసుల ప్రేక్షకపాత్ర: వై సతీశ్‌రెడ్డి



బీఆర్ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ గూండాలు దాడిచేసిన సమయంలో అక్కడే ఉన్న పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి విమర్శించారు. పోలీసుల సమక్షంలోనే తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఫొటోని తీసివేయడం ఏమిటని ప్రశ్నించారు.

### దాడి సిగ్గుచేటు: కిశోర్‌గౌడ్



భువనగిరి బీఆర్ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం సిగ్గుచేటని బీఆర్ఎస్ నేత కిశోర్‌గౌడ్ విమర్శించారు. పార్టీ కార్యాలయ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

### ప్రతిఘటన తప్పదు: తుంగ బాలు



రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు విమర్శించారు. రేవంత్‌రెడ్డే స్వయంగా అనేకసార్లు ప్రతిపక్ష నేతలపై దుర్భాషలాడారని, ఆయన వైఖరిని బట్టే కార్యకర్తలు ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. దొంగ దాడులు చేస్తే ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు.